సాక్షి
కర్నూలు
మంగళవారం । 29 । జూలై । 2025



వికసించని 'ఉద్యాన' సాగు

ఉద్యాన పంటల సాగుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఇవ్వడం లేదు. దీంతో మామిడి, అరటి, సపోట, మల్లె తదితర పంటలు సాగు సాగు తిరోగమనం అయ్యింది. 8లో▸



భక్తిపారవశ్యం

ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో శ్రావణ మాస మొదటి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ప్రత్యేక వంటకాలను వండి స్వామికి నైవేద్యం సమర్పించారు. 8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,624.54
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:75
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:1,07,500
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:1,07,500

న్యూస్‌రీల్

జీడీపీలోకి 'హంద్రీ-నీవా' నీరు



జీడీపీలో నిల్వ ఉన్న నీరు

గోనెగండ్ల: గాజులదిన్నె ప్రాజెక్టు (జీడీపీ)కు ఆదివారం రాత్రి నుంచి హంద్రీ- నీవా నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు ఏఈ మహమ్మద్ ఆలీ మాట్లాడుతూ.. హంద్రీ- నీవా కాలువ నుంచి 60, ఎల్లెల్సీ నుంచి 60 క్యూసెక్కుల నీరు నీరు జీడీపీలోకి వచ్చి చేరుతోందన్నారు. జీడీపీ సామర్థ్యం 4.5 టీఎంసీలు కాగా.. సోమవారం సాయంత్రానికి 1 టీఎంసీలకు చేరిందన్నారు. కోడుమూరు పట్టణానికి తాగునీటి కోసమని జీడీపీ ఎడమ కాలువ ద్వారా 30 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు చెప్పారు.

పింఛన్ల పంపిణీకి రూ.196.7 కోట్లు

కర్నూలు(అగ్రికల్చర్): ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్ కింద ఆగస్టు నెలకు ఉమ్మడి జిల్లాలో 4,55,491 పింఛన్లకు రూ.196.7 కోట్లు మంజూరయ్యాయి. రెండు నెలలుగా ఊరిస్తున్న స్పౌజ్ పింఛన్లను కూడా ఆగస్టు నెలలో ఇవ్వనున్నట్లు సమాచారం. ఈ కారణంగా పింఛన్ల సంఖ్య కొంత మేర పెరిగింది. ఈ నెల 31న పింఛన్ల నిధులు బ్యాంకులకు విడుదల కానున్నాయి.

అహోబిలంలో వైభవంగా తిరువాడిప్పూరం ఉత్సవం



స్వామి, అమ్మవార్ల వివాహం మహోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

ఆళ్లగడ్డ: ప్రముఖ పుణ్యక్షేత్రం అహోబిలంలో తిరువాడిప్పూరం ఉత్సవం వైభవంగా నిర్వహించారు. సోమవారం వేకువ జామునే దిగువ అహోబిలంలో కొలువైన మూలవిరాట్ శాంతమూర్తి శ్రీ ప్రహ్లాదవరదస్వామి, అమృతవల్లీ అమ్మవార్లతో పాటు గోదాదేవి అమ్మవార్లను సుప్రభాతసేవతో మేలుకొలిపి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గర్భగుడి ఎదురుగా ఏర్పాటు చేసిన యాగశాలలో ఉత్సవ మూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీప్రహ్లాదవరదస్వాములను, గోదాదేవి అమ్మవారికి ఎదురుగా కొలువుంచారు. వేద పండితుల వేద మంత్రోచ్ఛారణల మధ్య నవకలశ స్థాపన, అర్చన, అభిషేకం, తిరుమంజనం నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను నూతన పట్టువస్త్రాలు, మేనిమి ఆభరణాలతో అలంకరించి కొలువుంచా రు. రాత్రి స్వామి, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించిన అద్దాల మండపంలో శ్రీ గోదాదేవి, ప్రహ్లాదవరదుల కల్యాణం నిర్వహించారు. ఆ తర్వాత పల్లకీలో కొలువుంచి గ్రామోత్సవం చేపట్టారు. ముద్రకర్త కీడాంబి వేణుగోపాలన్, మణియార్ సౌమ్యానారాయణ్, అర్చకులు ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు.

శ్రీగిరి కిటకిట



శ్రీశైలంటెంపుల్: శ్రావణమాస తొలి సోమవారాన్ని పురస్కరించుకుని శ్రీశైల మహాక్షేత్రంలో వెలసిన శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి మల్లన్న దర్శనానికి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. వేకువ జాము నుంచే పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు మల్లికార్జునస్వామివారి దర్శనానికి క్యూలైన్ వద్దకు చేరుకున్నారు. ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూలైన్ల ద్వారా భక్తులు స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. భక్తుల శివనామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. భక్తుల రద్దీతో క్షేత్ర పుర వీధులన్నీ కిటకిటలాడాయి.

పచ్చని అడవుల్లో బంగారు శరీర ఛాయపై నల్లటి చారలతో పెద్ద పులి గాండ్రిస్తోంది. అనుకూల వాతావరణంతో 'పులి'కించిపోయి పదేళ్లలో తన వర్గాన్ని రెట్టింపు చేసుకుని నల్లమల నాదేనంటూ మీసం మిలేస్తోంది. కలిసొచ్చిన కాలంతో అభయారణ్యంలో తన సామ్రాజ్యాన్ని విస్తరించుకుంటూ షం'షేర్' అంటూ పంజా విసురుతోంది. అత్యాధునిక రక్షణ ఛత్రంలో తాను క్షేమంటూ శ్రీశైలం నుంచి శేషాచలం వైపు అడుగులు వేస్తున్న పెద్దపులి రాజసాన్ని ఇన్‌ఫ్రా రెడ్ కెమెరాలు కిసక్‌మంటూ బంధిస్తున్నాయి. జూలై 29 ఇంటర్నేషనల్ టైగర్ డే సందర్భంగా ప్రత్యేక కథనం.

– ఆత్మకూరురూరల్



నల్లమల పులికించి!

- పులుల స్వర్గధామం... ఆత్మకూరు అభయారణ్యం
- దశాబ్దకాలంలో రెండింతల పెరుగుదల
- శ్రీశైలం – శేషాచలం కారిడార్‌కు ప్రయత్నాలు
- నేడు అంతర్జాతీయ పెద్దపులుల దినోత్సవం

దశాబ్ద కాలం వెనక్కు వెళ్తే నల్లమల అడవుల్లో ఎక్కడ చూసినా.. కలప కోసం వెళ్లే మనుషులు, వారి ఎద్దుల బండ్లు, సైకిళ్ల వరుసలు కనిపించేవి. గొడ్డలి మోతలతో అడవి దద్దరిల్లేది. జాతీయ పులుల సంరక్షణాసాధికార సంస్థ తీసుకున్న నిర్ణయాలను తూచా తప్పక పాటించిన స్థానిక అధికారులు అడవిలో మానవ సంచారాన్ని పూర్తి స్థాయిలో నిరోధించారు. ప్రస్తుతం ఆదిమ గిరిజనులైన చెంచులు, అటవీ సిబ్బంది తప్ప అడవుల్లో తిరిగే వారే లేరు. ఇది పులుల సంరక్షణకు ఎంతో కలసివచ్చింది. పులుల సంచారానికి, సంయోగానికి ఆటంకం లేని పరిస్థితులతో వాటి సంఖ్య పెరగడానికి దోహదపడిందని చెప్పవచ్చు. నాగార్జునసాగర్ – శ్రీశైలం పెద్ద పులుల అభయారణ్యం యావత్ భారత దేశంలోనే విస్తీర్ణం రీత్యా అతి పెద్ద పెద్దపులుల అభయారణ్యం. సుమారు 3500 చ.కిమీ పరిధిలో విస్తరించిన ఈ అభయారణ్యంలో ఆత్మకూరు అటవీ డివిజన్ అత్యంత కీలకమైనది. ఎన్‌ఎస్‌టీఆర్‌లో 2015 నాటికి 37 పెద్దపులులు ఉన్నట్లు అటవీ అధికారులు గుర్తించారు. కాగా 2025 నాటికి ఈ సంఖ్య 87కు చేరుకుంది. అలాగే పులుల గణనలో మూడేళ్ల లోపు కూనలను లెక్కింపులోకి తీసుకోరు. దశాబ్ద కాలంలో ఎన్‌ఎస్‌టీఆర్‌లో పెద్దపులుల సంఖ్య ఏకంగా 87కు చేరుకుని దాదాపు 50 పులులు మేర పెరగడం పెద్ద విజయంగా చెప్పుకోవచ్చు. ఆత్మకూరు అటవీ డివిజన్‌లోని శ్రీశైలం, నాగలూటి, బైర్లూటీ రేంజ్‌లు పులుల ప్రవర్ధనానికి స్వర్గధామం. వాటి సంరక్షణా పద్ధతుల్లో అధికారులు తీసుకున్న చర్యలతో పాటు సహజ ఆవాసపు నాణ్యత కూడా కారణాలు అని చెప్పవచ్చు. పులి చాలా సిగ్గరి జంతువు. పులుల సంగమ సమయంలో మనిషి అలికిడి విన్నాచాలు అవి వెంటనే సమాగం నుంచి దూరమవుతాయి. లేత గర్భంతో ఉన్న ఆడపులులకు మానవ కలకలం వినపడినా సరే బెదురుతో గర్భస్రావం అవుతుంది. పులి విహారానికి ఆటంకం జరగకుండా అడవుల్లో మానవ ప్రవేశాన్ని సంచారాన్ని నియంత్రిస్తున్నారు.

పులుల లెక్కింపు ఇలా..



పెద్దపులి పాదముద్ర

అచ్చువేసిన పులిపాదముద్ర

పెద్ద పులుల పాద ముద్రలు సేకరించి వాటి ఆధారంగా పులుల సంఖ్యను అంచనా వేయడాన్నే స్టాండర్డ్ ఫగ్‌మార్క్ ఎన్యూమరేషన్ పద్ధతిగా పిలుస్తారు. పులుల సంచారాన్ని గుర్తించడం, అవి సంచరించే దారుల్లో రోజు సాయంత్రం మెత్తటి ఇసుక, మట్టితో నియమిత ప్రమాణంలో చదును చేస్తారు. **వీటినే** ఫగ్ ఇంప్రెషన్ ప్యాడ్స్‌గా పిలుస్తారు. పులులు ఆ ప్యాడ్స్ మీద నడిచినప్పుడు వాటిపై ఏర్పడిన పాదముద్రలను ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో అచ్చులుగా మారుస్తారు. ఇలా సేకరించిన అచ్చులను ఒక క్రమ పద్ధతిలో విశ్లేషించి పులుల సంఖ్యపై ఓ అంచనాకు **వస్తారు.** అలాగే అడవుల్ల ఇన్‌ఫ్రా రెడ్ కెమెరాలను ఏర్పాటు చేసి వాటిల్లో పడే చిత్రాల ఆధారంగా పులుల చారలను విశ్లేషిస్తారు. పులి చారలు మనుషుల వేలిముద్రలలాగే దేనికవే ప్రత్యేకంగా ఉంటాయి. పులి పెంటను సేకరించి వాటి డీఎన్‌ఏ మ్యాప్‌లను సేకరిస్తారు.

వైల్డ్‌లైఫ్ క్లినిక్

ఎన్‌ఎస్‌టీఆర్ పరిధిలో పని చేసేందుకు ఆత్మకూరు అటవీ డివిజన్ కేంద్రంగా బైర్లూటీలో ఒక వైల్డ్‌లైఫ్ క్లినిక్ ఏర్పాటు అయ్యింది. ఇందులో ఇద్దరు వన్యప్రాణి వైద్య నిపుణులు పని చేస్తున్నారు. వీరికి సహాయకారిగా ఒక అనిమల్ రెస్క్యూ వాహనం కూడా ఉంటోంది. పులులతో పాటు ఏ ఇతర వన్యప్రాణులు గాయపడినప్పుడు సత్వర చికిత్స అందించేందుకు ఈ క్లినిక్ ఎంతో ఉపయుక్తంగా ఉంది. అలాగే ఒక స్నిఫర్ డాగ్ కూడా ఉంది. ఇది ఇద్దరు సంరక్షకుల శిక్షణతో పని చేస్తోంది.

శేషాచలం వైపు అడుగులు

నల్లమలలోని శ్రీశైలం నుంచి శేషాచలం అడవుల వరకు పెద్దపులి ప్రస్థానం కొనసాగాలని ఆకాంక్షించిన అటవీ అధికారులు ఆదిశగా కార్యక్రమాలు చేపట్టారు. శ్రీశైలం, గుండ్ల బ్రహ్మేశ్వరం, నంద్యాల అటవీ డివిజన్, రుద్రవరం రేంజ్, వైఎస్సార్ జిల్లా లంకమల వరకు పెద్దపులుల ప్రస్థానం కొనసాగింది. ఈ నేపథ్యంలో పులులు స్వేచ్ఛగా సుదూర ప్రాంతాలకు తరలి వెళ్లడానికి తగిన వసతులు కల్పించడమే శ్రీశైలం – శేషాచలం పెద్దపులుల కారిడార్ ఆలోచనకు నాంది అయ్యింది. ఇటీవల ఆత్మకూరు అటవీ డివిజన్ పరిధిలో ఒక పెద్దపులి ఏకంగా అడవిని దాటి పూర్తిగా మైదాన ప్రాంతంలో 25 కిమీ సంచరించి తిరిగి అడవిలోకి వెళ్లడాన్ని అధికారులు గుర్తించారు. దీంతో పులి కారిడార్‌పై కొత్త ఆశలు చిగురించాయి. ఎలాంటి పచ్చదనం లేక పోయినా పులి ముందుకు వెళ్లగలుగుతుందనే నమ్మకం ఏర్పడింది. ఇక కేవలం పులికి, మనిషికి ఏర్పడే సంఘర్షణ నివారణ చర్యలు మాత్రమే తీసుకోవాల్సి ఉంటుందని గుర్తించారు.

వన్యప్రాణి కనిపిస్తే క్లిక్

అటవీ సంరక్షణ మొత్తం కను సన్నల్లో సాగుతోంది అంటే అతిశయోక్తి కాదు. ప్రధానమైన ప్రాంతాల్లో ఇన్‌ఫ్రారెడ్ కెమెరాలు ఏర్పాటు చేయడంతోనే ఇది సాధ్యమైంది. ఏ జీవమున్న కదలిక కెమెరాల ముందు జరిగితే చాలు కెమెరా ట్రిగ్గర్ అయి క్లిక్‌మని ఫొటోలు తీస్తుంది. అంతే కాక ఇవి ఆన్‌లైన్‌లో వెంటనే చూసే అవకాశం కూడా ఉంది. దీనితో వన్యప్రాణుల స్థితిగతులు, వాటిని వేటాడే వ్యక్తుల కదలికలు ఎప్పటికప్పుడు తెలుసుకునే వీలుంటుంది. ఉచ్చులకు చిక్కిన పులులను కూడా ఇలాగే గుర్తించి సంరక్షించిన ఘటనలు కూడా ఉన్నాయి.



అటవీ ప్రాంతంలో ఇన్‌ఫ్రారెడ్ కెమెరా అమర్చుతున్న సిబ్బంది

పెద్దపులి సంరక్షణలో ముందడుగు



పెద్దపులి సంరక్షణ కోసం అన్నిరకాల చర్యలు చేపట్టడంలో ముందడుగులో ఉన్నాము. పులి ఆహార జంతువులకు ఆహార కొరత లేకుండా 200 హెక్టార్లలో గడ్డి మైదానాలను అభివృద్ధి పరుస్తున్నాం. నీటి కొరత లేకుండా నీటి వనరుల పర్యవేక్షణ జరుగుతోంది. ఎన్‌ఎస్‌టీఆర్ పరిధిలో 80 నీటి కుంటల్లో పూడిక తీయించాం. పులుల సంఖ్య పెరుగుతున్నందువల్ల వాటి ఆహార జంతువుల నిష్పత్తి తగ్గకుండా బయటి ప్రాంతాల్లోంచి చుక్కల దుప్పులు, కణుతులను పూర్తి ఆరోగ్య పరీక్షలు నిర్వహించిన అనంతరం అడవిలో వదులుతున్నాం. ఇప్పటికే కాకినాడలోని నాగార్జున ఎరువుల కర్మాగారం వారి సంరక్షణలో ఉన్న దుప్పులను, కణుతులను, సత్యసాయిబాబా ట్రస్ట్ పరిధిలో ఉన్న హరిణి వనాల్లోని జింకలు అడవుల్లో వదలడానికి సిద్ధం చేశాం.

– వి సాయిబాబా, డిప్యూటీ డైరెక్టర్, ప్రాజెక్ట్ టైగర్, ఆత్మకూరు



కర్నూలు మెడికల్ కాలేజీ గ్రౌండ్‌లో పుట్టకు పూజలు చేస్తున్న భక్తులు

నాగదేవతా దీవించు!

నాగుల చవితి.. శ్రావణ మాసంలో మొదటి పర్వదినం. నాగదేవత విగ్రహాలకు, పుట్టలకు భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. చలిబిండి, నువ్వుల ఉండలు, పాలు, పండ్లు నైవేద్యంగా సమర్పించారు. కొత్తగా పెళ్లి అయిన దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి పాలుపోసి మొక్కులు తీర్చుకున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

విత్‌హెల్డ్ నిధుల విడుదలకు అవకాశం

కర్నూలు(అగ్రికల్చర్): ఉపాధి హామీ పథకం కింద 2014 నుంచి 2019 వరకు చేపట్టిన వివిధ పనులకు సంబంధించి విత్‌హెల్డ్‌లో పెట్టిన నిధుల విడుదలకు కేంద్రం అవకాశం కల్పించిందని డ్వామా పీడీ వెంకటరమణయ్య తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ... ఉపాధి నిధులతో చేపట్టిన అన్ని రకాల పనులకు సంబంధించి సోషల్ ఆడిట్ ప్రక్రియ పూర్తయ్యే వరకు 10 శాతం మొత్తాన్ని విత్‌హెల్డ్‌లో పెట్టారన్నారు. జిల్లాలో ఇటువంటి పనులు 12,504 ఉన్నాయన్నారు. ఈ పనులను రీ ఓపెన్ చేశారని, ఎఫ్టీవోలను అప్‌లోడ్ చేయాలని పీవో, ఏపీవోలను ఆయన ఆదేశించారు.

పొగాకు సాగు చేయించొద్దు

- వ్యవసాయ యంత్రాంగానికి ప్రభుత్వ ఆదేశాలు

కర్నూలు(అగ్రికల్చర్): 2024–25 సంవత్సరంలో రైతులు పండించిన పొగాకును కొనుగోలు చేయడంలో చేతులెత్తేసిన కూటమి ప్రభుత్వం 2025–26లో పొగాకు సాగు చేయించవద్దని ఆదేశించింది. గుంటూరు, పల్నాడు జిల్లాలతో సహా వివిధ జిల్లాల్లో పండించిన నల్లబర్లీ పొగాకును మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసేందుకు అనుమతిచ్చిన ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలో భారీగా పేరుకుపోయిన సిరి పొగాకు విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఉమ్మడి జిల్లాలో దాదాపు 40 వేల క్వింటాళ్ల పొగాకు నిల్వలు రైతుల దగ్గర పేరుకపోయాయి. ఇటు ప్రభుత్వం, అటు కంపెనీలు పట్టించుకోకపోవడంతో రైతులు కోలుకోలేని విధంగా నష్టపోయారు. రైతులకు న్యాయం చేయడంలో విఫలమైన ప్రభుత్వం ఈ ఏడాది పొగాకు సాగు చేయించవద్దని ఆదేశించింది. ఎక్స్‌పోర్ట్ లేనందున రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని, క్షేత్రస్థాయికి వెళ్లి పొగాకు సాగు చేయకుండా రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ యంత్రాంగానికి సూచన ఇచ్చింది.



మీ అభిమానం 'పచ్చగుండె'!


వైఎస్సార్‌సీపీ పట్ల, ఆ పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పట్ల చెరగని అభిమానానికి ఈ దృశ్యం అద్దం పడుతుంది. గ్రామీణ ప్రాంత ప్రజల్లో ఆ రూపం ఎంత పదిలంగా ఉందో ఈ సామాన్య రైతును కదిలిస్తే అర్థమవుతుంది. పత్తికొండ నియోజకవర్గంలోని చక్రాళ్ల గ్రామ సమీప పొలాల్లో పని చేసుకుంటున్న ఇతని పేరు రంగ నాయుడు. పార్టీ అధికారంలో లేకపోయినా అభిమాన నాయకుడి రూపంతో కూడిన టీ షర్ట్ ధరించి అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు. ' రాజు బలవంతుడైనప్పుడే శత్రువులంతా ఏకమవుతారు..' అనే కొటేషన్‌తో కూడిన టీ షర్ట్ తన అభిమాన నేత గురించి ఆ నిరుపేద రైతు మనసులోని అభిమానం స్థాయిని చాటుతోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

ఉద్యోగాల పేరుతో మోసం

- ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితులు
- పీజీఆర్‌ఎస్‌కు 104 ఫిర్యాదులు

కర్నూలు: ఉద్యోగాల పేరుతో మోసం చేశారన్న వారే ఎక్కువ మంది ఎస్పీ విక్రాంత్ పాటిల్‌ను కలసి తమ బాధను చెప్పుకున్నారు. డబ్బులిస్తే ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పే వ్యక్తులను నమ్మి మోసపోవద్దని, పోటీ పరీక్షల ఆధారంగానే ఉద్యోగాలు వస్తాయని ఎస్పీ వారికి సూచించారు. రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ పక్కనున్న క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఎస్పీ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి వినతులను స్వీకరించి వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు మొత్తం 104 ఫిర్యాదులు వచ్చాయి. ఫిర్యాదులపై చట్ట పరిధిలో విచారణ జరిపి న్యాయం చేసేందుకు చర్యలు తీసుకుంటామని బాధితులకు ఎస్పీ హామీ ఇచ్చారు. అడ్మిన్ అడిషనల్ ఎస్పీ హుసేన్ పీరా పీజీఆర్‌ఎస్‌లో పాల్గొని బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు.



ఎస్పీకి ఫిర్యాదు ఇస్తున్న బాధితులు

ఫిర్యాదుల్లో కొన్ని..

- కర్నూలుకు చెందిన వీరస్వామి ఉద్యోగాలు ఇప్పిస్తానని రూ.8 లక్షలు డబ్బులు, 5 తులాల బంగారం తీసుకుని మోసం చేశాడని నాగరాజు ఫిర్యాదు చేశారు.
- రైల్వే డిపార్ట్‌మెంట్‌లో క్యాడర్ కోర్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి వెల్దుర్తికి చెందిన ప్రశాంత్ బాబు రూ.12.50 లక్షలు తీసుకుని మోసం చేశాడని శ్రీనగర్ కాలనీకి చెందిన రవిబాబు ఫిర్యాదు చేశారు.
- బీటెక్ చేసిన తనకు హైదరాబాదుకు చెందిన షణ్ముఖ్ సుదర్శన్ అనే వ్యక్తి కన్సల్టెన్సీ పేరుతో గచ్చిబౌలిలో ఐటీ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి రూ.4 లక్షలు తీసుకుని మోసం చేశాడని జొహరాపురంకు చెందిన గుణశేఖర్ ఫిర్యాదు చేశారు.

కర్నూలులో అక్రమ రిజిస్ట్రేషన్లు

- సమస్యను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్‌కు అర్జీ ఇచ్చిన ప్రజలు

కర్నూలు కల్చరల్: జిల్లా కేంద్రమైన కర్నూలులో కొన్ని స్థలాలను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేస్తున్నారని, రామ ప్రియనగర్‌లో ఇది ఎక్కువగా ఉందని, చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషాకు ప్రజలు అర్జీ ఇచ్చారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. జిల్లా కలెక్టర్‌తో పాటు జేసీ డాక్టర్ బి.నవ్య ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి వాటికి తగు పరిష్కారాలు చూపాలని అధికారులను ఆదేశించారు. కృష్ణానగర్ రైల్వే అండర్ బ్రిడ్జి దగ్గర నుంచి ఐటీసీ సర్కిల్ వరకు ఉన్న రోడ్లు గుంతలు ఏర్పడి, రాకపోకలకు ఇబ్బందిగా ఉందని, అధికారులు స్పందించాలని ప్రజలు అర్జీ ఇచ్చారు. అలాగే భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునః ప్రారంభించి, జీవో నెంబర్ 17ను రద్దు చేయాలని, నాణ్యత, పరిశుభ్రం పాటించని హోటల్స్‌పై చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు వినతి పత్రాలు అందజేశారు. అర్జీల స్వీకరణ అనంతరం అధికారులతో జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా మాట్లాడారు. లాగిన్‌లో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు చూడాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్వో సి.వెంకట నారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా



తుంగభద్ర నదీ తీరంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

నదీతీరంలో శ్రీమఠం పీఠాధిపతి పర్యటన



మంత్రాలయంలో మునిగిన స్నానపు ఘాట్లు

మంత్రాలయం: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన మంత్రాలయం సమీపంలోని తుంగభద్ర నదీ తీరంలో శ్రీరాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు సోమవారం పర్యటించారు. రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు సమీపిస్తుండటంతో ఏర్పాట్లను పర్యవేక్షించారు. నదీ పరివాహక ప్రాంతంలో స్నానాలకు ఏర్పాటు చేసిన షవర్లను పరిశీలించారు. నదీ తీరంలో భక్తులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను అధికారులకు సూచించారు.

మునిగిన స్నానపు ఘాట్లు

మంత్రాలయం రూరల్: వరద నీరు పోటెత్తడంతో తుంగభద్ర నది ఉధృతంగా ప్రవహిస్తోంది. మంత్రాలయంలో స్నానపు ఘాట్లు మునిగిపోయాయి. నదీ తీర ప్రాంతంలో లోతట్టు పంట పొలాలు ఇప్పటికే జలమయం అయ్యాయి.

క్లుప్తంగా

డీపీఓలో ఇద్దరు అధికారుల బదిలీ

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా పోలీసు కార్యాలయంలో ఇద్దరు అధికారులు అయ్యారు. ఈ మేరకు డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ ఆమోదం తెలిపింది. గ్రేహౌండ్స్ విభాగంలో ఏఓగా పనిచేస్తున్న ఎస్.విజయలక్ష్మిని జిల్లా పోలీస్ కార్యాలయం ఏఓగా బదిలీ చేశారు. కడప జిల్లా పోలీసు అధికారి కార్యాలయంలో ఏఓగా పనిచేస్తున్న జ్యోతిని కర్నూలు డీపీసీఏ ఏఓగా బదిలీ చేశారు. ఈ మేరకు డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు.

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య

కర్నూలు: కుటుంబ కలహాలతో షేక్ జాకియా (35) అనే వివాహిత ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈమె భర్త షేక్ డిరాంశ వెల్డింగ్ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సోమవారం ఇంట్లో అత్తతో గొడవపడి షేక్ జాకియా ఉరి వేసుకుంది. కొద్దిసేపటికి కుటుంబ సభ్యులు గుర్తించి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈమెకు ఇద్దరు కూతుర్లు, కుమారుడు సంతానం. నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ నాయకుల స్వలాభాపేక్ష



సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఎదురుగా రేకుల షెడ్లు

డోన్: ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా స్వలాభాపేక్ష కోసం టీడీపీ నాయకులు డోన్ పట్టణ శివారులోని ఎంకె టౌన్‌షిప్ వద్ద ఏర్పాటు చేసిన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఎదురుగా రేకుల షెడ్లు వేశారు. దీంతో ఆ స్థలం ఇరుకుగా మారడంతో దస్తావేజులేఖరులతో పాటు ప్రజలు ఇక్కట్ల పాలవుతున్నారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి ఒకవైపు టీడీపీ నాయకుని షాపింగ్ కాంప్లెక్స్, ఎదురుగా ఏర్పాటు చేసిన అద్దె రేకుల దుకాణాల కారణంగా స్థలం లేకుండాపోయింది. మరో రెండు వైపులు వంకలు ఉండటంతో ప్రజలు దిక్కుతోచని స్థితిని ఎదుర్కొంటున్నారు. కేవలం స్వలాభాపేక్ష కోసం ప్రజలకు సౌకర్యాలు లేకుండా చేయడం టీడీపీ నాయకులకు తగదని ప్రజలు వాపోతున్నారు.

రిటైర్డ్ డీఎస్పీపై దాడి

ఆదోని అర్బన్: పట్టణంలోని ఎస్కేడీ కాలనీలో నివాసముంటున్న రిటైర్డ్ డీఎస్పీ రఘునాథ్‌బారిపై ముగ్గురి వ్యక్తులు దాడి చేశారు. టూటౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. కొన్ని రోజుల క్రితం రిటైర్డ్ డీఎస్పీకి ప్లాటు ఇస్తానని బిల్డర్ రాఘవేంద్రరెడ్డి అనే వ్యక్తి డబ్బు అడ్వాన్సుగా తీసుకున్నాడు. ప్లాట్ ఇవ్వకపోవడంతో సోమవారం రిటైర్డ్ డీఎస్పీ డబ్బు తిరిగి అడిగినందుకు రాఘవేంద్రరెడ్డితో పాటు మరో ఇద్దరు దాడి చేశారు. రిటైర్డ్ డీఎస్పీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ప్రకృతి రక్షణ అందరి బాధ్యత



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

నంద్యాల(న్యూటౌన్): ప్రకృతి వనరులను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని జిల్లా ఫారెస్ట్ అధికారి అనురాగ్‌మీనా పేర్కొన్నారు. ప్రపంచ ప్రకృతి సంరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం నంద్యాల పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ కళాశాల ఆవరణలో అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఫారెస్ట్ అధికారి మాట్లాడుతూ ప్రకృతి వనరులైన అడవులు, నీరు, గాలి, భూమి ఇతర జీవ సంపదను సంరక్షించాల్సిన అవసరాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని సూచించారు. ప్రకృతి సంరక్షణపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అనంతరం రామకృష్ణారెడ్డి, ప్రొఫెసర్ ప్రగతిరెడ్డి, ప్రిన్సిపాల్ సుబ్బయ్య పాల్గొన్నారు.



వెండి అలంకరణలో పూజలందుకుంటున్న ఈరన్నస్వామి

శ్రావణ ఉత్సవం.. భక్తిపారవశ్యం



ఆలయ ఆవరణలో భక్తుల రద్దీ

శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా మొదటి సోమవారం ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున 4 గంటలకు సుప్రభాతసేవ, మహా మంగళ హారతి, ఆకుపూజ, బిందుసేవ, పంచామృతాభిషేకం తదితర పూజల అనంతరం భక్తులను స్వామి దర్శనానికి వదిలారు. ఇంటి దేవుడిని దర్శించుకునేందుకు మన రాష్ట్రం నుంచేకాక తెలంగాణ, కర్ణాటక సుదూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ పరిసరాల్లో ప్రత్యేక వంటకాలను వండి స్వామి వారికి నైవేద్యంగా సమర్పించారు. భక్తుల సౌకర్యార్థం అతిశీఘ్ర, ప్రత్యేక, శీఘ్ర దర్శనం ఏర్పాట్లు చేశారు. ఫుట్‌వేర్ బ్రిడ్జీల ఏర్పాటుతో ఎలాంటి ఇబ్బంది లేకుండా క్యూలైన్లలో వచ్చి స్వామిని భక్తులు దర్శించుకున్నారు. భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశామని డిప్యూటీ కమిషనర్ విజయరాజు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం కౌతాళం సీఐ అశోక్‌కుమార్ గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. – కౌతాళం



ఆరుబయట నైవేద్యం వండుతున్న దృశ్యం



కాలువలో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

వికసించని 'ఉద్యాన' సాగు

- ప్రోత్సాహకాలు ఇవ్వని రాష్ట్ర ప్రభుత్వం
- 2023–24లో కరువు వచ్చినప్పటికీ 90,780 హెక్టార్లలో సాగు
- కూటమి ప్రభుత్వం వచ్చాక 71,630 హెక్టార్లకు పడిపోయిన వైనం
- 20.55 లక్షల నుంచి 7.83 లక్షల టన్నులకు తగ్గిన ఉత్పాదకత
- క్షేత్రస్థాయిలో కనిపించని పండ్లతోటల అభివృద్ధి



సాగులో ఉన్న జామ

2019-20 నుంచి 2024-25 వరకు
ఉద్యాన పంటల సాగు, ఉత్పాదకత వివరాలు..

సంవత్సరం	ఉద్యానపంటల సాగు (హెక్టార్లలో)	ఉద్యానపంటల ఉత్పాదకత (టన్నుల్లో)
2019-20	1,17,889	20,55,819
2020-21	1,11,919	19,28,549
2021-22	1,04,733	17,64,261
2022-23	91,059	11,36,950
2023-24	90,780 (ఈ ఏడాది కరువు)	6,01,228
2024-25	71,630	7,83,552

కర్నూలు(అగ్రికల్చర్): రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ప్రోత్సాహకాలు ఇవ్వకపోవడంతో ఉద్యాన పంటల సాగు వికసించడం లేదు. మామిడి, అరటి, జామ, సపోట, చినీ, నిమ్మ, దానిమ్మ, మల్లె, సన్నజాజి, మునగ తదితర పంటలు సాగు క్రమంగా తగ్గుతోంది. రాష్ట్ర ఆర్థికాభివృద్ధి పెంచేందుకు ఉద్యాన పంటలు కీలకపాత్ర వహిస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఉద్యాన పంటల సాగు పురోగమనంలో ఉండి, ఉత్పాదకత భారీగా వచ్చేది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత ఉద్యాన పంటల సాగు తిరోగమనం అయ్యింది. ఉత్పాదకత కూడా డీలాపడిపోయింది.

వైఎస్సార్‌సీపీ పాలనలో ఇలా..

కర్నూలు జిల్లాలో 2019–20 నుంచి 2023–24 వరకు ఉద్యాన పంటల సాగు గణనీయంగా పెరిగింది. 2023–24లో వర్షాభావ పరిస్థితులతో కరువు ఏర్పడినా ఉత్పాదకత తగ్గలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించింది. 'ఉపాధి' నిధులతో 100 శాతం సబ్సిడీతో పండ్లతోటల అభివృద్ధికి అవకాశం కల్పించింది. సుగంధద్రవ్యాల పంట ఉత్పత్తులకు రికార్డు స్థాయిలో ధరలు లభించాయి. వర్షాలు ఆశాజనకంగా పడటం, ప్రతి ఏటా హంద్రీ–నీవా కాలువకు నీరు రావడంతో ఉద్యాన పంటల సాగు భారీగా పెరిగింది. 2019–20లో రికార్డు స్థాయిలో 1,17,889 హెక్టార్లలో పంటలు సాగు కాగా... ఉత్పాదతక 20.55 లక్షల మెట్రిక్ టన్నులకు చేరింది. 2023–24లో వర్షాభావ పరిస్థితులు ఏర్పడటంతో కరువు మండలాలను ప్రకటించినా ఉద్యాన పంటల సాగు ఆశాజనకంగానే కనిపించింది.

'కూటమి'లో సబ్సిడీలకు సున్నా!

కూటమి ప్రభుత్వ అధినేత నారాచంద్రబాబు నాయుడు రైతుల సంక్షేమం అంటూ మాటల్లో తప్ప చేతల్లో చూపడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఇందుకు నిదర్శనంగా కూటమి ప్రభుత్వం ఏర్పాటు తర్వాత 2024–25లో ఉద్యాన పంటల సాగు పడిపోవడాన్నే చెప్పవచ్చు. ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రోత్సాహకాలు లేకపోవడం, ఉద్యాన పంటల ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో సాగుపై రైతుల్లో విముఖత ఏర్పడింది. జిల్లాలో ప్రధాన ఉద్యాన పంటలైన మామిడి, అరటి సాగు తగ్గిపోయింది. జామ, సపోట, చినీ, నిమ్మ తదితర పంటలు సాగు చేయడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. జిల్లాలో 2023–24లో 90,780 హెక్టార్లలో ఉద్యాన పంటలు సాగయ్యాయి. అయితే 2024–25లో మాత్రం సాగు 71,630 హెక్టార్లకు పడిపోయింది. ఎంఐడీహెచ్, ఆర్‌కేవీవై కింద యాక్షన్ ప్లాన్ ఇచ్చినప్పటికీ కార్యరూపం దాల్చలేదు. 2024–25లో కూరగాయల సాగుకు ఎలాంటి సబ్సిడీలు లేవు.

ఆ'ధర'ణ లేక!

2022–23 నుంచి సుగంధ ద్రవ్యాలకు చెందిన మిర్చి పంటకు రికార్డు స్థాయిలో ధరలు లభించాయి. ఏకంగా క్వింటాల్‌కు గరిష్టంగా రూ.53వేలకుపైగా ధర లభించింది. దీంతో 2023–24లో రికార్డు స్థాయిలో సాగు చేశారు. ఈ ఏడాది కూడా మిర్చి పంటకు గిట్టుబాటు ధరలు లభించాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటు తర్వాత జిల్లాలో మిర్చి 95 వేల ఎకరాల్లో సాగు అయ్యింది. నల్లతామర, వైరస్ తెగుళ్ల కారణంగా దిగుబడులు పడిపోయాయి. సాగు తగ్గి దిగుబడులు పడిపోయినప్పటికీ ధరలు అట్టడుగుకు పోయాయి. క్వింటాల్‌కు గరిష్టంగా రూ.10 వేలు కూడా లభించిన దాఖలాలు లేవు. మద్దతు ధరతో కొంటామని ఊరించిన కూటమి ప్రభుత్వం చివరికి మిర్చి రైతులను నట్టేట ముంచింది.

ప్ర'గతి' తప్పి!

వేలాది ఎకరాల్లో పండ్లతోటలు అభివృద్ధి చేస్తున్నట్లు లెక్కలు చూపుతున్నా.. క్షేత్రస్థాయిలో కనిపించని పరిస్థితి. ఇందుకు ఈ–క్రాప్‌లో నమోదవున్న లెక్కలే నిదర్శనం. 2023–24లో ఈ–క్రాప్ ప్రకారం 4,155 హెక్టార్ల(10,387ఎకరాలు)లో పండ్లతోటలు ఉన్నాయి. 2024–25లో ఉపాధి నిధులతో 4,150 ఎకరాల్లో పండ్లతోటలు అభివృద్ధి చేసినట్లు లెక్కలు ఉన్నాయి. 2024–25లో ఉద్యాన శాఖ కూడా 1,000 ఎకరాల్లో పండ్లతోటలు అభివృద్ధి చేసినట్లు చెబుతోంది. ఈ ప్రకారం 2024–25లో పండ్లతోటల సాగు భారీగా పెరగాలి. ఈ–క్రాప్ ప్రకారం 2024–25లో (4660 హెక్టార్ల(11650 ఎకరాలు)లో పండ్లతోటల సాగు ఉన్నట్లు తేలింది. 2023–24తో పోలిస్తే 2024–25లో కేవలం 505 హెక్టార్ల(1262 ఎకరాలు)లో మాత్రమే పండ్లతోటల సాగు పెరిగింది. ఉపాధి నిధులతో చేపడుతున్న పండ్లతోటల సాగు ఆన్‌లైన్‌లో మాత్రమే కనిపిస్తోంది తప్ప క్షేత్రస్థాయిలో లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

ఆకతాయిలపై డ్రోన్ నిఘా

కర్నూలు: కళాశాలలు, పాఠశాలల వద్ద ఈవ్ టీజింగ్‌కు పాల్పడే ఆకతాయిలపై నిఘా కోసం పోలీసులు డ్రోన్ కెమెరా సేవలను వినియోగిస్తున్నారు. సోమవారం నగరంలోని ఆర్‌ఎస్ రోడ్డులో ఉన్న కేవీఆర్ కళాశాల, మౌర్యా ఇన్ వద్ద ఉన్న చైతన్య కళాశాల సమీపంలో ఆకతాయిల ఆట కట్టించేందుకు శక్తి టీమ్ పోలీసులు డ్రోన్ కెమెరాతో నిఘా పటిష్టం చేశారు. శక్తి టీమ్ సీఐ విజయలక్ష్మి ఆధ్వర్యంలో బాలికలు, మహిళలకు భద్రతపై భరోసా కల్పిస్తూ అత్యాధునిక డ్రోన్ కెమెరాలు వినియోగిస్తూ ఈవ్ టీజింగ్‌కు పాల్పడే వారిని అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చారు. అలాగే పోలీసు బృందాలతో విద్యాసంస్థల వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సుంకేసులను సందర్శించిన ఎస్ఈ



డ్యామ్‌ను పరిశీలిస్తున్న ఎస్ఈ బాలచంద్రారెడ్డి

కర్నూలు (సిటీ): టీబీ డ్యాం నుంచి విడుదల చేస్తున్న 1.19 లక్షల క్యూసెక్కుల నీరు సుంకేసుల బ్యారేజీకి చేరుకుంటోంది. దీంతో జలవనరుల శాఖ పర్యవేక్షక ఇంజినీర్ (ఎస్ఈ) బాలచంద్రారెడ్డి సోమవారం సుంకేసులను సందర్శించారు. బ్యారేజీకి వస్తున్న ఇన్‌ఫ్లో, బయటకు వదులుతున్న ఔట్‌ఫ్లో వివరాలను ఇంజినీర్లను అడిగి తెలుసుకున్నారు. వరదనీటి ప్రవాహాన్ని దృష్టిలో పెట్టుకుని రెగ్యులర్‌గా మానిటరింగ్ చేయాలని ఇంజినీర్లకు సూచించారు. బ్యారేజీ నుంచి 1,03,437 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

దుప్పిని వేటాడి.. మాంసాన్ని విక్రయించి!

- ఒకరు అరెస్ట్, నాటు తుపాకీ స్వాధీనం
- నిందితులను తప్పించేందుకు యత్నం



వేటగాడి అరెస్ట్ చూపుతున్న అటవీ అధికారులు

ఆళ్లగడ్డ: నిషేధిత ఆయుధాలతో అడవిలోకి ప్రవేశించిన వేటగాళ్లు దుప్పిని వేటాడి, దాని మాంసాన్ని విక్రయించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అటవీ శాఖ అధికారి మూర్తుజావలి తెలిపిన వివరాల మేరకు.. అహోబిలం గ్రామానికి చెందిన కొందరు వేటగాళ్లు 27వ తేదీ అహోబిలం నార్త్ బీటులోని నూతల బావి రస్తా సమీపంలో ఉండగా గుర్తించి అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించగా అందులో ముగ్గురు పరారీ కాగా ఒకరు పట్టుబడ్డాడు. అధికారుల విచారణలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. పట్టుబడిన ప్రభాకర్‌ను సోమవారం కోర్టులో హాజరు పరచగా రిమాండ్‌కు తరలించారు. పారిపోయిన ముగ్గురు వ్యక్తులను గుర్తించి త్వరలో అరెస్ట్ చేస్తామన్నారు. కాగా అహోబిలం గ్రామం సమీపంలోని టేకు ప్లాట్‌లో శనివారం అహోబిలం గ్రామానికి చెందిన నలుగురు వేటగాళ్లు తుపాకులతో దుప్పిని వేటాడి దాని మాంసాన్ని మరో వ్యక్తి (వన్య ప్రాణుల మాంసం బ్రోకర్) ద్వారా అహోబిలం, బాచేపల్లి, ఆలమూరు గ్రామాల్లో విక్రయించినట్లు సమాచారం. ఈ విషయం అటవీ అధికారుల దృష్టికి రావడంతో ఇద్దరు వేటగాళ్లను అదుపులోకి తీసుకుని విచారించగా విషయం అంతా చెప్పినట్లు తెలుస్తోంది. ఆ నలుగురు వేటగాళ్లు ఎవరు ? మాంసం విక్రయించిన బ్రోకర్ ఎవరు అన్నది కూడా అధికారులకు తెలిసినప్పటికీ గుర్తు తెలియని వ్యక్తులుగా చెప్పడంతో పాటు అడవిలో కనిపించినందుకే అరెస్ట్ చేశామని చెప్పడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. పట్టుబడిన ఇద్దరిలో ఒకరిని మాత్రమే అరెస్ట్ చూపించడం, ఒక తుపాకీ మాత్రమే దొరికింది. మిగతా ముగ్గురు అనుమానితుల కోసం గాలిస్తున్నామని అధికారులు ప్రకటించడంపై పలు వ్యవక్తమవుతున్నాయి. రాజకీయ ఒత్తిళ్లతోనే అధికారులు కేసును నీరుగార్చుతున్నారనే విమర్శలు ఉన్నాయి.

చిన్నారిపై పిచ్చికుక్క దాడి

పాణ్యం: మండల కేంద్రమైన పాణ్యంలోని గడ్డంపేటకు చెందిన మహిమ్ అనే బాలికపై పిచ్చికుక్క దాడి చేసినట్లు స్థానికులు తెలిపారు. గమనించిన స్థానికులు కుక్కను వెంబడించారు. ఈ దాడిలో బాలికకు గాయాలు కావడంతో పాణ్యం ప్రభుత్వ ఆసుపత్రిలో తీసుకెళ్లి చికిత్స అందిస్తున్నారు. అయితే పాణ్యంలో ప్రధాన వీధుల్లో కుక్కలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. రాత్రి సమయంలో కుక్కలు సంచారం ఎక్కువగా ఉందని ప్రజలు వాపోతున్నారు.

బాబోయ్.. కొండముచ్చులు

- జలదుర్గంలో ఆగని కొండముచ్చు దాడులు
- బయటకు వచ్చేందుకు జంకుతున్న గ్రామస్తులు
- బోన్లు ఏర్పాటు చేసిన అటవీశాఖ అధికారులు

ప్యాపిలి: జలదుర్గం గ్రామ ప్రజలకు గత వారం రోజులుగా కంటి మీద కునుకు కరువైంది. గత కొద్ది రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు గ్రామ శివారు ప్రాంతంలో కొండముచ్చు కోతులను వదిలి వెళ్లినట్లు సమాచారం. అప్పటి నుంచి గ్రామంలోకి వచ్చిన కోతులు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ఈ గుంపులోని ఓ కొండముచ్చు కోతి పగలు, రాత్రి అని తేడా లేకుండా గ్రామస్తులపై దాడికి పాల్పడుతోంది. ఇప్పటి వరకు దాదాపు 20 మందికి పైగా ఈ కొండముచ్చు బారిన పడి గాయపడ్డారు. తాజాగా ఆదివారం అర్ధరాత్రి ఓ ఇంట్లోకి చొరబడిన కొండ ముచ్చు గాఢనిద్రలో ఉన్న మీనిగ లక్ష్మీదేవి అనే మహిళ తలపై కరిచింది. దీంతో ఆమె తల నుంచి తీవ్ర రక్తస్రావం కావడంతో చికిత్స నిమిత్తం ఆమెను ఆసుపత్రికి తరలించారు. కొండముచ్చు ఆగడాలతో గ్రామస్తులు ఇంటి నుంచి బయటకు రావాలంటే జంకుతున్నారు. చిన్న పిల్లల తల్లిదండ్రులు తమ పిల్లలను బయటకు తీసుకెళ్లలేని పరిస్థితి నెలకొంది. పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థులపై కూడా కొండముచ్చులు దాడి చేయడంతో గత రెండు రోజులుగా తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలలకు పంపడం లేదు. కొండముచ్చుల బారి నుంచి తమను కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఇంటికి తలుపులు వేసుకుని గ్రామస్తులు ఇళ్లలోనే బిక్కుబిక్కు మంటూ గడుపుతున్నారు.

బోన్లు ఏర్పాటు చేసిన అధికారులు

గత వారం రోజులుగా జలదుర్గం గ్రామంలో కొండ ముచ్చు మూక స్వైర విహారం చేస్తుండటంతో ఎట్టకేలకు అటవీశాఖ అధికారులు స్పందించారు. పలు చోట్లు బోన్లు, వలలు ఏర్పాటు చేశారు. అయితే ఇప్పటి వరకు ఒక్క కొండముచ్చు కూడా బోన్‌లో చిక్కలేదు. కాగా అధికారులు సోషల్ మీడియా, దండోరా ద్వారా గ్రామస్తులను అప్రమత్తం చేశారు. ఇళ్లలో నుంచి బయటకు వచ్చే పరిస్థితి ఉంటే తగు జాగ్రత్తలతోనే బయటకు రావాలన్నారు. రాత్రి వేళల్లో మిద్దెలపై, ఆరు బయట నిద్రించకూడదన్నారు. బజార్లలో గుంపులుగా గుమికూడదని వీఆర్‌ఓ సునీల్ ప్రజలను అప్రమత్తం చేశారు. చిన్న పిల్లలను ఒంటరిగా బయటకు పంపరాదన్నారు.



గాయపడిన బాధితురాలితో మాట్లాడుతున్న అధికారులు

రోడ్డెక్కని మహిళల ఉచిత బస్సు!

- ఇప్పటి వరకు అమలు కాని చంద్రబాబు హామీ
- ఆగస్టు 15న అమలు చేస్తామని ఆర్భాట ప్రకటన
- జిల్లా వరకే పరిమితం అంటూ ప్రచారాలు
- బస్సులు లేవు.. భారమవుతుందని అనుకూల మీడియాలో ప్రచారం



ఆత్మకూరు: పక్కన ఉన్న తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో మహిళల కోసం ఉచిత బస్సులను నడుపుతున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీని ఇప్పటి వరకు అమలు చేయలేదు. ఆగస్టు 15వ తేదీ నుంచి అమలు చేస్తామని చెప్పినా మంత్రులతో, టీడీపీ నేతలతో రకరకాల వ్యాఖ్యాలు చేయిస్తున్నారు. ఉచిత బస్సు ప్రయాణం జిల్లా వరకే పరిమితం అనే ప్రచారం ఎక్కువ చేస్తున్నారు. రాష్ట్రంలో ఆర్టీసీ బస్సులు లేవని, మహిళలకు ఉచిత బస్సు ఇస్తే రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థిక భారమవుతుందని టీడీపీ అనుకూల మీడియాలు వార్తా కథనాలు ప్రచురిస్తూ రకరకాల అపోహలను సృష్టిస్తున్నాయి. దీంతో మహిళలు రాష్ట్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో ఉచిత హామీ ఇవ్వడం ఎందుకు.. అధికారంలోకి వచ్చాక ఆలస్యం చేయడం ఎందుకు అని ప్రశ్నిస్తున్నారు.

జిల్లాకే పరిమితం అయితే ఇవీ కష్టాలు..

ఉచిత బస్సు ప్రయాణం జిల్లాకే పరిమితం చేస్తామని చేస్తున్న ప్రకటనలపై మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- నంద్యాలకు చెందిన బ్రాహ్మణకొట్కూరు గ్రామం నుంచి కర్నూలు జిల్లా పరిధిలోని గార్గేయపురం గ్రామానికి వెళ్లాలంటే కేవలం ఆరు కి.మీ. దూరం మాత్రమే ఉంది. దాదాపు టికెట్ రూ.10 ఉంది. ఈ మార్గంలో ఉచిత బస్సు ప్రయాణం అమలు కాలేదు.
- బ్రాహ్మణకొట్కూరు మహిళలు కర్నూలుకు వెళ్లాలంటే చార్జీ చెల్లించాలి. కేవలం కర్నూలు 15 కి.మీ. దూరంలో ఉన్నా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కరువే.
- నంద్యాల జిల్లా పరిధిలోని ఆత్మకూరు నుంచి ప్రకాశం జిల్లాలోని దోర్నాల వెళ్లాలంటే 60 కి.మీ. దూరం ఉంది. టికెట్ మాత్రం రూ.120. ఆత్మకూరు నుంచి దోర్నాకు వెళ్లేందుకు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం రాదు.
- శ్రీశైలం నంద్యాల జిల్లాలో ఉన్నప్పటికీ ప్రకాశం జిల్లా పరిధిలోని దోర్నాల మీదుగా వెళ్లాలి. మహిళలు ఆర్టీసీ బస్సులో ఎక్కితే కచ్చితంగా టికెట్ తీసుకోవాల్సిన పరిస్థితి ఉంది.
- నంద్యాల జిల్లా పరిధిలోని చాగలమర్రి నుంచి మైదుకూరుకు 20 కి.మీ. దూరంలోనే ఉంది. ఆర్టీసీ బస్సులో ఎక్కితే రూ.30 చార్జీ చెల్లించాల్సి ఉంది.

అన్నీ అబద్ధాలేనా?

ఉచిత బస్సు సౌకర్యాన్ని జిల్లా వరకే కల్పిస్తామని చెప్పడంపై మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేస్తున్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు అన్నీ అబద్ధాలే చెబుతున్నారు అని ఆరోపిస్తున్నారు. పూర్తిస్థాయితో ఉచిత బస్సు సర్వీసు కల్పిస్తే మహానంది, శ్రీశైలం, అహోబిలం, ద్రాక్షారామం, అన్నవరం, తిరుమల, శ్రీకాళహస్తి, మంత్రాలయం దర్శించుకోవచ్చని, భక్తిభావం పెరుగుతుందని మహిళలు చెబుతున్నారు. ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రమంతా మహిళలు ఉచితంగా బస్సుల్లో తిరిగేవిధంగా జీవో ఇవ్వాలని కోరుతున్నారు. అలాగే పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసులకే కాకుండా సూపర్ లగ్జరీ, నాన్‌ఏసీ బస్సుల్లో కూడా మహిళలే ఉచితంగా ప్రయాణం చేసే విధంగా చట్టం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. నంద్యాల, కర్నూలు ఉమ్మడి జిల్లాలో ప్రతిరోజూ 20 నుంచి 30 వేల మంది మహిళలు ప్రయాణం చేసే అవకాశం ఉన్నట్లు ఆర్టీసీ అధికారులు పేర్కొంటున్నారు.

అమలు చేస్తారో లేదో



అధికారం కోసం ఎన్నికల సమయంలో ఎన్నో హామీలు ఇచ్చారు. ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమంది మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని చెప్పారు. అధికారంలోకి వచ్చి యేడాదిన్నర అయినా ఇంతవరకు ఊసే లేదు. ఆగస్టు 15న ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలు చేస్తారో లేదో చూడాలి – దర్గమ్మ, ఆత్మకూరు

మోసగించడం సరికాదు



ఉచిత బస్సు సర్వీసు పేరుతో కూటమి ప్రభుత్వం ఆశ కల్పించింది. ఇప్పుడు నిబంధనలు విధించడం సరికాదు. సొంత జిల్లాకే ప్రయాణం సరిచేస్తే చాలా కష్టాలు వస్తాయి. ఇలా చేస్తే కూటమి ప్రభుత్వం మహిళలను మోసగించినట్లు అవుతుంది. ఇప్పటికైనా ఉచిత బస్సు హామీని రాష్ట్రమంతా అమలు చేయాలి. – పార్వతి, ఆత్మకూరు

ఖాతాదారులకు సేవలు మరింత చేరువ చేస్తాం



నూతన భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న చీఫ్ జనరల్ మేనేజర్ రాజేష్ కుమార్ పటేల్ తదితరులు

కర్నూలు(అగ్రికల్చర్): భారతీయ స్టేట్ బ్యాంకు సేవలను మరింత సులభతరం చేస్తున్నట్లు అమరావతి సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ రాజేష్‌కుమార్ పటేల్ తెలిపారు. సోమవారం గాయత్రీ ఎస్టేట్ సమీపంలోని ఎస్‌బీఐకి చెందిన దాదాపు 4.50 ఎకరాల భూమిలో వివిధ విభాగాలు ఒకే సముదాయంలో ఉండేలా రూ.13 కోట్లతో నిర్మించే భారీ భవన నిర్మాణానికి ఆయన తన సతీమణి సప్నా పటేల్‌తో కలసి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు ఎస్‌బీఐ మౌలిక వసతుల అభివృద్ధిలో ఒక ముఖ్యమైన మైలు రాయి వంటిదన్నారు. ఈ భవన సముదాయంలో పరిపాలన విభాగం, రీజినల్ బిజినెస్ సెంటర్, ప్రాసెసింగ్ సెంటర్, ఆర్ఏఎస్ఎంఈసీసీ, ఏఎంసీసీ, ఎస్ఎంఈ బ్రాంచీలతో పాటు ప్రస్తుతం గాయత్రీ ఎస్టేట్‌లో ఉన్న టీఫ్ బ్రాంచ్ కూడా ఉంటాయన్నారు. ఈ భవన నిర్మాణ పనులు 15 నెలల్లో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అమరావతి సర్కిల్ (ఎన్‌డబ్ల్యూ–3) జనరల్ మేనేజర్ అమ్రేంద్రకుమార్, డిప్యూటీ జనరల్ మేనేజర్‌లు పంకజ్‌కుమార్, హేమా, రీజినల్ మేనేజర్లు, కర్నూలులోని వివిధ బ్రాంచీల అధికారులు పాల్గొన్నారు.